రైతులకు ఊరటనివ్వని ఉల్లి సాగు

వేముల : ఈ ఏడాది ఉల్లి సాగు రైతులకు ఊరటనివ్వలేదు. సాగులో ఆశలు పెట్టుకున్న రైతులకు నిరాశే మిగులుతోంది. సాగులో ఆదాయం ఉంటుందనే ఉద్దేశ్యంతో పెట్టుబడులకు రైతులు వెనుకాడలేదు. గత ఏడాది బాగా ధరలు ఉండటంతో రైతులకు ఆదాయం వచ్చింది. దీంతో రైతులు ఈ ఏడాది ముందుగా ధరలు ఉంటాయనే ఉద్దేశ్యంతో ముందుగానే ఉల్లి సాగు చేశారు. అయితే దిగుబడులు అందే సమయానికి మార్కెట్ ధరలు లేకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. ఉద్యాన పంటలలో సున్నితమైన పంట ఉల్లి. ఉల్లి సాగులో దిగుబడులు ఎలా ఉన్న మార్కెట్ ధరలు రైతులను తీవ్ర నిరాశపరుస్తున్నాయి.

నియోజకవర్గంలో 3 వేల ఎకరాలలో సాగు

పులివెందుల నియోజకవర్గంలో 3 వేల ఎకరాలకు పైనే ఉల్లి సాగైంది. కొంతమంది రైతులు మే నెలలోనే ఉల్లి సాగు చేశారు. ముందుస్తుగా సాగు చేస్తే ధరలు ఉంటాయని ఆశించారు. మరికొంతమంది రైతులు జూన్ మాసంలో ఉల్లి సాగు చేశారు. మే నెలలో సాగు చేసిన తోటలలో ఉల్లి గడ్డలను రైతులు పీకి వేస్తున్నారు. ఒక్క రైతు 2ఎకరాల నుంచి 5 ఎకరాల వరకు ఉల్లి పంటను సాగు చేసుకున్నారు.



తోటలలో పీకివేసిన ఉల్లి గడ్డలు



ఉల్లి గడ్డలను కోస్తున్న కూలీలు

దారుణంగా పడిపోయిన ఉల్లి ధరలు

ఉల్లి ధరలు ఇంత దారుణంగా ఎప్పుడు చూడలేదని రైతులు అంటున్నారు. కొంతమంది రైతులు ధరల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే తోటలలో పంట కాలం పూర్తి కావడంతో గడ్డలు దెబ్బతింటాయని రైతులు పీకివేస్తున్నారు. క్వింటా ఉల్లిగడ్డలు ఐదారు వందలకు మించి ధరలు లేవని రైతులు వాపోతున్నారు. కొంతమంది రైతులు ఉల్లి గడ్డలను తాడేపల్లె గూడెంకు తరలించారు. అక్కడ కూడా ధరలు లేకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. దీంతో కొనుగోలు చేసేందుకు వ్యాపారులు కూడా ముందుకు రావడంలేదు.

పెట్టుబడులు కూడా దక్కలేదని రైతుల ఆవేదన

ఎకరా ఉల్లి సాగుకు రూ.70 వేలకుపైనే పెట్టుబడు లు పెట్టారు. ధరలు పడిపోవడంతో పెట్టుబడులు కూడా దక్కే పరిస్థితి లేదని రైతులు అంటున్నారు. ధరలు ఇలాగే ఉంటే తోటలలో ఉల్లిగడ్డలను పీకివేయాల్సిన అవసరం లేదని, ఇలాగే వదలివేసి దున్ని వేస్తామని రైతులు అంటున్నారు. ఇప్పటికే అప్పులు చేసి సాగు చేశామని, ఉల్లి గడ్డలు పీకేందుకు మళ్లీ అప్పు చేయలేమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉల్లి సాగులో తీవ్రంగా నష్టపోయా



ఈ ఏడాది ఉల్లి సాగులో తీవ్రంగా నష్టపోయా. నాకున్న 5 ఎకరాలలో ఉల్లి సాగు చేశా. ముందుగా సాగు చేసిన 2.50 ఎకరాలలో ఉల్లి గడ్డలు పీకివేసి తాడేపల్లె గూడెం తరలించా. మార్కెట్ క్వింటా ఐదారు వందలతో అమ్మివేశా. ఉల్లిగడ్డలను తల్లించినా రవాణా ఖర్చులు కూడా రాలేదు. ఉల్లి విత్తనాలకే రూ.లక్ష ఖర్చు చేశా. సాగులో రూ.2.50 లక్షలకుపైనే పెట్టుబడి పెట్టా. ధరలు లేక సాగులో నష్టపోయా.

– రవీంద్రారెడ్డి, రైతు, నారేపల్లె

5 ఎకరాలలో ఉల్లి సాగు చేశా



నాకున్న 5 ఎకరాలలో ఉల్లి సాగు చేశా. సాగుకు సుమారు రూ.లక్ష పెట్టుబడి పెట్టా. అయితే ధరల కోసం ఎదురుచూస్తున్నా. ఈ ధరలతో అమ్మితే కూలీ ఖర్చులు కూడా రావు. గడ్డలు పూర్తయ్యాక ఎక్కువ రోజులు నిల్వ ఉంచలేం. మరో వారం రోజులలో ఉల్లి గడ్డలను పీకి వేయాల్సి ఉంది. ఉల్లిగడ్డలను బయట మార్కెట్‌కు తరలించినా ఈ ధరలతో రవాణా ఖర్చులు కూడా రావు.

– సురేంద్రారెడ్డి, ఉల్లి రైతు, నారేపల్లె

క్లుప్తంగా

13న జాతీయ లోక్ అదాలత్

కమలాపురం : ఈనెల 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ మధుసూదన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, క్రిమినల్, బ్యాంకు కేసులు ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. రాజీ ధోరణిలో ఉన్న ఇరు వర్గాల కక్షిదారులు ఈ విషయాన్ని గమనించి సెప్టెంబర్ 13వ తేదీన జరిగే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని తమ కేసులను పరిష్కరించుకోవాలని మెజిస్ట్రేట్ తెలిపారు.

పిల్లల రక్షణకు 1098 టోల్‌ఫ్రీ

ముద్దనూరు : పిల్లల రక్షణ కొరకు, వారి హక్కులు కాపాడడానికి 1098 టోల్‌ఫ్రీ నంబరును సద్వినియోగం చేసుకోవాలని బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ మహేష్ తెలిపారు. గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలుర, బాలికోన్నతపాఠశాలల్లో చైల్డ్ హెల్ప్‌లైన్ నంబరుపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 24 గంటలు అందుబాటులో వుండే 1098 నంబరు పిల్లలు ప్రమాదంలో వున్నప్పుడు, వారి హక్కులకు భంగం కలిగినప్పుడు, శారీరక మానసిక వేధింపులకు గురైనప్పుడు, తప్పిపోయినప్పుడు తదితర సమస్యలకు ఉపయోగించవచ్చని సూచించారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విశాలాక్షి, లక్ష్మీదేవి, ప్రధానోపాధ్యాయులు ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

లింగాల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపక ఉద్యోగాల కోసం దరఖాస్తులను కోరుతున్నామని ప్రిన్సిపాల్ శ్రీరామ్ తెలిపారు. కళాశాలలో గణితం, అర్థ శాస్త్రం గెస్ట్ అధ్యాపక ఉద్యోగాల కోసం అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 8వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈనెల 10వ తేదీలోపు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.

ముందస్తు వేడుకలు



వివిధ వేషధారణలలో ఉన్న విద్యార్థులతో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, తదితరులు

వేంపల్లె : స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో ముందస్తు మిలాద్ ఉన్ నబీ, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించినట్లు కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. గురువారం పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయుల వేషధారణలు, నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయ పాత్ర కీలకమన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు చైతన్యరెడ్డి, చేతన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

9వ రోజు వినాయక నిమజ్జనాలు



వేడుకలో చిందులేస్తున్న యువకులు

పులివెందుల టౌన్ : పట్టణంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా 9వ రోజు గురువారం వినాయక నిమజ్జన వేడుకలు వైభవంగా సాగాయి. పట్టణంలోని రెడ్డివారివీధి, మైత్రి లేఔట్, తదితర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన అతి పెద్ద గణనాథులను ప్రత్యేక వాహనంలో ఉంచి డప్పు వాయిద్యాల నడుమ మహిళలు, యువకులు భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని రంగులు చల్లుకున్నారు.

ఆటల పోటీలు

పులివెందుల టౌన్ : సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి(ఉపాధ్యాయ దినోత్సవం) సందర్భంగా పులివెందుల మండలం అచ్చివెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు గురువారం ఆటల పోటీలు నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులకు మ్యూజికల్ చైర్స్, త్రోబాల్, షాట్ పుట్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో ప్రథమ, ద్వితీయ తృతీయ బహుమతులను అంగడి నాగేంద్ర, రాజశేఖర్‌రెడ్డి, నాగరాజు నాయక్‌లు గెలుచుకున్నారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ వెంకట నాయుడు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో జష్నే మిలాద్



ప్రదర్శనకు ఉంచిన జ్ఞాపికలు

కమలాపురం : భక్తుల కొంగు బంగారంగా నిలిచిన పట్టణంలో వెలసిన శ్రీ హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి దర్గాలో జష్నే మిలాదున్నబీ వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గురువారం రాత్రి దర్గా పీఠాధిపతి సజ్జాద్–ఏ–నషీన్ హజరత్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో, వైఎస్సార్ సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ, దర్గా కన్వీనర్ షేక్ ఇస్మాయిల్ పర్యవేక్షణలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అశేష భక్త జన సందోహం నడుమ మిలాద్ వేడుకలు వైభవంగా నిర్వహించారు. పీఠాధిపతి నివా సం నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చి పూల చాదర్లను స్వామి వార్ల మజార్లపై సమర్పించి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి మహమ్మద్ ప్రవక్తకు సంబంధించిన దా దాపు 100కు పైగా వస్తువులను ప్రదర్శనకు (ఆసారే షరీఫ్) ఉంచారు. భక్తులు వాటిని చూసేందుకు ఆసక్తి చూపారు. అనంతరం భక్తులకు గఫారియా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీఠాధిపతి సోదరులు గౌస్‌పాక్, జియా, సర్ఫరాజ్, గ్రామ ప్రజలు, మహిళలు, స్థానిక, ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : పట్టణంలోని ఆస్థానయే గౌసియా అధిపతి సయ్యద్ షా గౌస్‌పీరాఖాద్రీ, పీఠాధిపతి సయ్యద్‌షా తాహిర్‌పీరా ఖాద్రీల ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్తకు సంబంధించిన జ్ఞాపికల ప్రదర్శన భక్తి శ్రద్ధలతో జరిగింది. మహమ్మద్ ప్రవక్త ఉపయోగించిన వస్తువులను ప్రదర్శనగా ఉంచారు. అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. ముస్లింలు ఈ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

హంస వాహనంపై శ్రీరంగనాథుడు



పులివెందుల టౌన్: మున్సిపాలిటీలోని శ్రీరంగనాథ స్వామి ఆలయంలో నూలు పూజ ప్రవిత్రోత్సవాల్లో భాగంగా 8వ రోజు శ్రీరంగనాథుడు హంస వాహనంపై సతీసమేతంగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో అర్చకులు కృష్ణరాజేష్‌శర్మ ఉభయదారులచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. శుక్రవారం శ్రీరంగనాథుని కల్యాణాన్ని కల్యాణదుర్గం చల్లా వంశీయుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.

యాజమాన్య పద్ధతులను పాటించాలి



చింతలజూటూరులో ఉల్లి పంటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖాధికారి రవిచంద్ర

వేముల : జిల్లా వ్యాప్తంగా ఉల్లి సాగు చేసే రైతులు యాజమాన్య పద్ధతులను పాటించాలని జిల్లా ఉద్యానశాఖాధికారి రవిచంద్ర సూచించారు. మండలంలోని చింతలజూటూరు గ్రామంలో ఉల్లి పంటను గురువారం పులివెందుల హెచ్ఓ రాఘవేంద్రారెడ్డితో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. పులివెందుల నియోజకవర్గంలో సాగు చేసిన ఉల్లి పంటలో 20 శాతం మాత్రమే పంట కోత దశకు వచ్చిందన్నారు. మిగిలిన 80 శాతం సెప్టెంబర్ నెలాఖరులో కానీ, అక్టోబర్ మొదటి వారంలో పంట కోత దశకు వస్తాయన్నారు. ప్రభుత్వం ఉల్లి పంటకు క్వింటా రూ.1200లు మద్దతు ధర ప్రకటించిందన్నారు. వైఎస్సార్ జిల్లాలోని మైదుకూరు, కమలాపురం మార్కెట్ యార్డులలో ఉల్లి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని రైతులు తమ ఉల్లి పంటను అక్కడ నిల్వ చేసుకుని విక్రయించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ సేవలు అందించాలి



చిలంకూరులో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ రమణ

ఎర్రగుంట్ల : విద్యుత్ సంస్థపై ప్రజలకు నమ్మకం పెంచే విధంగా విద్యుత్ సిబ్బంది సేవలు అందించాలని జిల్లా విద్యుత్ అధికారి సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ అన్నారు. గురువారం చిలంకూరు గ్రామంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక సబ్‌డివిజన్ కార్యాలయంలో వీరపునాయునిపల్లె, ఎర్రగుంట్ల, కమలాపురం మండలాల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వినియోగదారుడు తమ విద్యుత్ సమస్యలపై వచ్చినప్పుడు సిబ్బంది, అధికారులు వారితో మర్యాదపూర్వకంగా ప్రవరిస్తూ సమస్యలను పరిష్కరించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు తగినన్న అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యుత్ అంతరాయాలు రాకుండా చూసుకోవాలన్నారు. ఆర్‌డీఎస్‌ఎస్ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో సింగిల్ ఫేస్ కెబుల్ లైన్ల స్థానంలో త్రీఫేస్ 5 వైర్ల ఎల్టీలైన్‌ను కండక్టర్ ద్వారా ఏర్పాటు చేసే పనులలో పురోగతి పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణారెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్‌కుమార్, ఏఈలు, జేఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వానికి రైతులంటే చిన్న చూపు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : రాష్ట్ర ప్రభుత్వం రైతులంటే చిన్న చూపు చూస్తుందని ఇచ్చిన హామీలను ఏమాత్రం నెరవేర్చడం లేదని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి విమర్శించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేక అల్లాడిపోతున్నారు. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడి రైతులు తీవ్రంగా పంట నష్టం చవిచూశారు. మరికొన్ని ప్రాంతాల్లో సరైన వర్షాలు లేక కరువుతో అల్లాడిపోతున్నారు. పంటలు నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీగాని, ఇన్సూరెన్సులు ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రైతుల పంటలకు ఎరువులు, యూరియా సక్రమంగా పంపిణీ చేయడంలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ఏనాడు రైతులు రోడ్లపైకి వచ్చి ఎరువులు, యూరియా కోసం క్యూకట్టిన సందర్భాలు లేవు. ఆర్బీకేలలో రైతులకు ఎటువంటి ఎరువులు కావాలో తెలుసుకుని కేవలం 48 గంటల్లోనే ఎరువులు, యూరియా సరఫరా చేశారు. ప్రస్తుతం యూరియా దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. దాల్మియా పరిశ్రమ విస్తరణ కోసం ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణలో కలెక్టర్ శ్రీధర్ దాల్మియా యాజమాన్యంతో రైతుల సమస్యలను పరిష్కారం చేస్తామని హామీఇచ్చారు. నేడు దాల్మియా యాజమాన్యం దుగ్గనపల్లి గ్రామాన్ని మార్చవలసిన అవసరంలేదని, రైతుల భూములు కొనవలసిన అవసరం లేదంటూ ఢిల్లీలో ఉన్న పర్యావరణశాఖకు ఉత్తరం రాసింది. మరి కలెక్టర్ చెప్పింది ఎమిటి, దాల్మియా పరిశ్రమచేసింది ఎమిటి. ఎవరు మాట మార్చారో కలెక్టర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి రైతులకు చెప్పాలన్నారు. పట్టణ అధ్యక్షుడు మహేశ్వరరెడ్డి, మండలాధ్యక్షుడు మహేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం(శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్లు పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖంమీద మచ్చలు, చర్మంపై టి.బి.మచ్చలు, కుష్టు, తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

విధులను బహిష్కరించిన పారిశుద్ధ్య సిబ్బంది



జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులుకు సమ్మె నోటీసు ఇస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

వేంపల్లె : స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది విధులను బహిష్కరించారు. గురువారం కార్యాలయంలో ఉన్న పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులును వారు కలిసి సమ్మె నోటీస్‌ను అందించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య సిబ్బంది మాట్లాడుతూ 5 నెలలుగా జీతాలు చెల్లించలేదని, 15 నెలలుగా పీఎఫ్ చెల్లించలేదన్నారు. తాము చాలా ఇబ్బందులకు గురవుతున్నామని, దీంతో తమకు జీతాలు చెల్లించేంతవరకు విధులకు హాజరు కాలేమన్నారు. తక్షణమే జీతాలు ఇవ్వాలని కోరారు.

పాఠకుల అభిరుచి మేరకు పుస్తకాలు ఏర్పాటు

కమలాపురం : గ్రంథాలయానికి ప్రతి రోజు వచ్చే పాఠకుల అభిరుచి మేరకు పుస్తకాలు, పత్రికలు, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచుతామని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ తెలిపారు. గురువారం స్థానిక గ్రంథాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు, రిజిష్టర్లు, పుస్తకాలను పరిశీలించి ఇంకా ఏవైన పుస్తకాలు అవసరమా? అని గ్రంథాలయాధికారి జింకా చంద్రశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే పాఠకులతో మాట్లాడుతూ పాఠకుల అభిరుచి మేరకు వారికి అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచుతామన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, అన్ని రకాల ప్రజలు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని మీ జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి సిబ్బందితో మాట్లాడారు. బకాయి ఉన్న గ్రంథాలయ సెస్సు ను చెల్లించాలని మున్సిపల్ సిబ్బందిని ఆయన కోరారు.

త్వరలో సొసైటీలలో రైతులకు ఎరువులు

లింగాల : త్వరలో సొసైటీల ద్వారా రైతులకు ఎరువులు, ఆన్‌లైన్ సేవలు ప్రారంభమవుతాయని సొసైటీ అధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక సహకార సొసైటీని ఆయన సందర్శించారు. లింగాల సొసైటీలో త్వరలో రైతులకు ఎరువులు, ఆన్‌లైన్ సేవలు ప్రారంభం, రైతులకు దీర్ఘకాలిక రుణాలు, పంట రుణాలు, పాడి రైతులకు పశువుల కొనుగోలుకు రుణాలు అందిస్తామన్నారు. సీఈఓ వినోద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఇస్లామిక్ ఇయర్ పుస్తకావిష్కరణ

వేంపల్లె : దేశంలో, రాష్ట్రంలో ఐక్యతను చాటి చెప్పే విధంగా ఆప్ కీ ఆవాజ్ రాష్ట్ర కమిటీ ఇస్లామిక్ ఇయర్ ప్రత్యేక సంచికను ఆప్ కీ ఆవాజ్ రాష్ట్ర కమిటీ ముద్రించడం సంతోషకరమని మాజీ జెడ్పీటీసీ డాక్టర్ ఎస్.ఎఫ్.బాషా తెలిపారు. గురువారం వేంపల్లెలోని స్థానిక డాక్టర్ ఎస్ఎఫ్ బాష ఆసుపత్రిలో ఈ ప్రత్యేక సంచికను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. భారతదేశం లౌకిక ప్రజాస్వామ్య దేశమని, సర్వమతాలకు ఆధిపత్యం వహిస్తున్న దేశమని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఆప్ కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బుల్ బాషా, ఆప్ కీ ఆవాజ్ జిల్లా గౌరవ సలహాదారులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోకపోతే ఉద్యమం తప్పదు



దండుపల్లిలో ఉల్లిపంటను పరిశీలించి మాట్లాడుతున్న గాలిచంద్ర

ఎర్రగుంట్ల : ఉల్లి పంట సాగు చేసే రైతులకు గిట్టుబాటు ధర క్వింటాకు రూ.3 వేలతో ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోకపోతే ఉద్యమం తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర హెచ్చరించారు. గురువారం మండలంలోని దండుపల్లి, వీరపునాయునిపల్లె మండలంలోని వెల్దుర్తి, కొమ్మద్ది, తొండూరు మండలంలోని గంగనపల్లి గ్రామాలలో సీపీఐ నాయకులు, ఏపీ రైతు సంఘం నాయకులు పర్యటించి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. జిల్లాలో దాదాపు పదివేల ఎకరాలలో ఉల్లి పంట సాగు చేసినట్టు ప్రాథమిక అంచానా ఉందన్నారు. ఎకరా పంట సాగుకు కనీసం అంటే రూ. లక్ష ఖర్చు వస్తుందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు క్వింటా ధర రూ.1200తో కొనుగోలు చేసిన రైతులకు ఎలాంటి లాభం రాదన్నారు. ఎమ్మెస్ స్వామినాథన్ చేసిన సిఫార్సుల ఆధారంగా కనీసం మద్దతు ధర నిర్ణయించాలన్నారు. కొనుగోలు దారు తరువు పేరుతో క్వింటాకు 15 కిలోల చొప్పున దోపిడికి పాల్పడుతున్నారన్నారు. గిట్టుబాటు ధరలు లేక, నిలువ చేసుకునే వెసులుబాటులేక చేసిన అప్పులు తీర్చలేక రైతులు ఆత్మహత్యలే శరణ్యమంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, వెంకటరాముడు, హరిహరనారయణ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఈఓపీఆర్డీ

వేంపల్లె : మండల ఈఓపీఆర్డీగా రామ్మోహన్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. పొద్దుటూరు మండలం కొత్తపల్లె గ్రామ పంచాయతీలో కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై వేంపల్లెకు వచ్చారు. దీంతోపాటు వేంపల్లె గ్రామపంచాయతీ ఇన్‌చార్జ్ ఈఓగా కలెక్టర్ చెరుకూరు శ్రీధర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ బాధ్యతలు తీసుకోలేదు. ఈ విషయంపై ఈఓపీఆర్డీ రామ్మోహన్‌రెడ్డి అడగగా, నాకు కొన్ని సమస్యలు ఉన్నాయని ఈ విషయంపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తర్వాత ఏ విషయం తెలియజేస్తానని దాట వేశారు. అంతవరకు ఈఓపీఆర్డీగా కొనసాగుతానని తెలిపారు. గత ఆరు నెలలుగా వేంపల్లె గ్రామపచాయతీకి పర్మినెంట్ ఈఓ లేకపోవడంతో గ్రామంలో డ్రైనేజీ, పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. కనీసం పారిశుద్ధ్య కార్మికులకు 5 నెలలుగా జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితి ఉంది. ఇకనైనా ఉన్నతాధికారులు, కలెక్టర్ స్పందించి వేంపల్లె గ్రామపంచాయతీకి పర్మినెంట్ ఈఓను నియమించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

భాగవత పఠనంతో మానసిక ప్రశాంతత

లింగాల : భాగవత పఠనం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ రాజ్యసభ సభ్యులు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ తులసిరెడ్డి తెలిపారు. గురువారం పార్నపల్లెలోని ఓంకారేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భాగవత సప్తాహ కార్యక్రమం నిర్వహించారు. ఆధునిక మానవుడు అశాంతితో అలమటిస్తున్నాడని, ఆధ్యాత్మిక ప్రదేశాలు, ఆధ్యాత్మిక సమావేశాలు శాంతిని కలిగిస్తాయన్నారు.